TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 139 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.13.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## మతతత్వ బీజేపీపై కలిసి పోరాడుతాం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఒక్కతాటిపైనే ఉన్నాయనీ, మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఏపీకి చెందిన పార్టీల మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కారు మనుగడ సాగిస్తోందన్నారు. ఆ రెండు పార్టీలు లేకపోతే మోడీ సర్కారు అధికారంలోకి వచ్చేది కాదని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యేల నివాస సముదాయంలో జరిగిన సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు పార్టీల నాయకులు వేదికపై ఉన్నప్పటికీ యాదవులందరూ ఒక్కటేనని చెప్పారు. భగవాన్ శ్రీకృష్ణుడి ఆశీస్సులు యాదవులందరిపైనా ఉంటాయన్నారు. యూపీ, ఏపీ నుంచి కూడా తమ పార్టీకి చెందిన నేతలు ఇక్కడకు వచ్చారని తెలిపారు.

రాజకీయాలకు అతీతమైన వేదిక ఇది అనీ, వేర్వేరు పార్టీలకు చెందిన వారమైనప్పటికీ, అందరం కూడా ఒక్కటేనని ప్రకటించారు. పెండ్లీండ్ల సందర్భంగా గుర్రపు బగ్గీపై కూర్చుని బరాత్‌లో పాల్గొనటం చూశాననీ, ఇప్పుడు ఇక్కడ గుర్రపు బగ్గీపై ప్రధాన వేదిక వద్దకు తనను తీసుకురావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ ప్రత్యేకత ఉన్న నాయకుడనీ, అందుకే నన్ను బగ్గీపై ఊరేగించారని చమత్కరించారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో సాదరంగా ఆహ్వానం పలకడమే కాకుండా శ్రీకృష్ణ నినాదాలు చేయడం ఈ కార్యక్రమానికి మరింత శోభనిచ్చిం దన్నారు. ఉత్తరప్రదేశ్ బీజేపీని వెనక్కునెడు తున్నామనీ, వచ్చే ఎన్నికల్లో ఎస్పీ సారథ్యంలోని కూటమి జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ములాయం సింగ్ యాదవ్ తనను చిన్న వయస్సులోనే ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి సీఎంను చేశాడని కొనియాడారు. తనలాగే అనిల్ కుమార్ యాదవ్ కూడా చిన్న వయస్సులోనే రాజ్యసభ సభ్యుడయ్యారని ప్రశంసించారు.

సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర పండుగగా ఆచరించడం సంతోషించదగ్గ విషయమని కితాబిచ్చాడు. అందుకు కృషి చేసిన అంజన్ కుమార్ యాదవ్, ఇతర నేతలను ఆయన అభినందించారు. సదర్ ఉత్సవానికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమ్మేళనానికి వేలాదిగా జనం హాజర య్యారనీ, ఇంకా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్, పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్, టీపీసీసీ నేత గౌరీ యాదవ్, యాదవ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, బతుకమ్మ ఆటపాటలు, ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శనలు, ఉత్తరాది డ్రమ్స్ ప్రదర్శన తో అఖిలేశ్ యాదవ్‌ను అంజన్‌కుమార్, అనిల్ కుమార్‌యాదవ్, వీహెచ్, తదితరులు స్వాగతించారు. గుర్రపు బగ్గీపై ఊరేగింపుగా వేదికవద్దకు తీసుకెళ్లారు. ఏకేవై పేరుతో యువత హల్‌చల్ చేసింది. దున్నపోతుల ప్రదర్శనను చేసింది. సభలోకి పట్టుకొచ్చిన చిన్న దూడ అందర్నీ ఆకట్టుకున్నది.

## పంపకాలు షురూ




ఖమ్మం :అమృత్ తెలంగాణ: రెండో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. 14వ తేదీ ఆదివారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పంపకాలు జోరందుకున్నాయి. డబ్బుల కోసం అభ్యర్థులు, వారి మద్దతు దారులు శుక్రవారం నుంచే తీవ్ర వేట మొదలు పెట్టారు. గ్రామాల్లో ప్రతిష్ట దెబ్బతినకుండా ఉండాలని ఎక్కడ వీలైతే అక్కడ డబ్బులు గుంజుకొ స్తున్నారు. ఆయా పార్టీల పైస్థాయి నాయకులు డబ్బుల విషయంలో చాలా వరకూ ముఖం చాటేస్తుండటంతో చేసేది లేక సొంతగానైనా ఖర్చు పెట్టి తమ అభ్యర్థులను గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు.

రిజర్వ్‌డ్ స్థానాల్లో తమ అనుచరులను పోటీకి నిలిపిన ఆయా గ్రామాల నాయకులు ప్రచారం మొదలు ఆర్థికఅంశాల వరకూ సర్వం మీదేసుకుంటున్నా.. అభ్యర్థి సైతం ఎంతో కొంత భరించక తప్పనిస్థితి. ఈ క్రమంలో రిజర్వ్‌డ్ స్థానాల నుంచి పోటీచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తమ స్తోమతకు మించి డబ్బులు అప్పుగా తెస్తున్నారు. కొందరు ఆస్తులు, భూములను తనఖా పెడుతుండగా మరికొందరు భార్య, పిల్లల బంగారాన్ని తాకట్టుపెట్టి డబ్బులు తెచ్చి ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. మొదటి దఫా ఎన్నికల్లో ఇలా ఖర్చు పెట్టి ఓటమి పాలైన పలువురు అభ్యర్థులు తాము ఇచ్చిన డబ్బులను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్న సైతం ఇలా డిమాండ్ చేసిన వారిలో ఉండటం గమనార్హం.

పోటాపోటీ పంపకాలు షురూ..

రాష్ట్రంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. ఇవి మినహా 3,918 సర్పంచ్, 30,046 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ పోటాపోటీ పంపకాలు శుక్రవారం రాత్రి నుంచే మొదలయ్యాయి. ఓటుకు రూ.500 నుంచి రూ.5వేల వరకూ పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఒక అభ్యర్థి రూ.వెయ్యి పంచితే మరో అభ్యర్థి రూ.2వేలు పంపిణీ చేస్తున్నారు. వీటికి తోడు చీరెలు, కుక్కర్లు, చికెన్, మటన్, మద్యం సైతం పంపిణీ చేస్తున్నారు.

రవాణా ఖర్చులు సైతం..

వివిధ గ్రామ పంచాయతీల ఓటర్లు హైదరాబాద్, ఖమ్మం, ఇతర నగరాల్లో నివసిస్తున్నారు. వారిని రప్పించేందుకు అయ్యే రవాణా ఖర్చులు సైతం అభ్యర్థులు, మద్దతుదారులే భరిస్తున్నారు. ఒక్కొక్కరి రానుపోనూ రవాణా ఖర్చు హైదరాబాద్ నుంచి తక్కువలో తక్కువగా రూ.వెయ్యి వరకు అవుతున్నాయి. ఓటుకిచ్చే డబ్బులకు తోడు అదనంగా రవాణా ఖర్చులు సైతం ఇస్తామని ఫోన్లు చేసి చెబుతున్నారు. కొందరికి ఏకంగా ఫోన్ పే, గూగుల్ పే చేస్తున్నారు. నలుగురైదుగురు కలిసి ట్యాక్సీ మాట్లాడుకొని వస్తే అందుకయ్యే ఖర్చు కూడా తామే ఇస్తామని ఫోన్ చేసి చెబుతున్నారు. శనివారం రాత్రి వరకూ గ్రామానికి చేరుకోవాలని వేడుకుంటున్నారు.

డబ్బులు సమకూర్చేందుకు పడరాని పాట్లు

అధికార పార్టీ మినహా మిగిలిన పార్టీల పైస్థాయి నాయకులు పలువురు గ్రామీణనాయకులకు పూర్తిస్థాయిలో డబ్బులు సమకూర్చలేకపోతున్నారు. ఓటుకు రూ.2వేలు, 3వేలు ఇవ్వాల్సిన చోట రూ.10 లక్షలకు పైగా పంపిణీ చేయాల్సి వస్తుండగా రూ.2, 3 లక్షల వరకే పైస్థాయి నాయకులు సమకూర్చుతున్నారు. ఇవి సరిపోకపోవటంతో స్థానిక నాయకులు తలా కొంత జమచేసి తమ అభ్యర్థి గెలుపు కోసం నానా తంటాలు పడుతున్నారు. అభ్యర్థులు, మద్దతుదారులు అప్పులు చేసి డబ్బులు సమకూర్చుతున్నారు. ఈ పరిణామం గ్రామీణ నాయకుల కుటుంబాల్లో విభేదాలకు దారితీస్తోంది. నాయకులు అప్పుతెచ్చి సర్దుబాటు చేస్తుండటంతో కుటుంబంలో వివాదాలు తలెత్తుతున్నాయి. ఇక రెబల్ అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీల నాయకుల దగ్గరకు వెళ్లి డబ్బుల కోసం ప్రాధేయపడుతున్నారు. తమ అభ్యర్థి గెలిస్తే మీ పార్టీలో చేర్పిస్తామని హామీ ఇచ్చి డబ్బులు తెచ్చుకుంటున్న దాఖలాలు ఉన్నాయి. ఇలా పంపకాల కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోందని గ్రామ నాయకులు వాపోతున్నారు. శుక్రవారం రోజంతా వేచిచూస్తే తమ నాయకుడు రూ.2 లక్షలు చేతిలో పెట్టి ఇంతకు మించి తనతో కాదన్నాడని ఓ నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండో దఫా ఖమ్మంలో 163.. భద్రాద్రిలో 140 పంచాయతీల్లో ఎన్నికలు

ఖమ్మం జిల్లాలోని ఆరు మండలాలు కామేపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండలో 23 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇవి మినహా 163 స్థానాల్లో ఎన్నికలు జరుగుతాయి. భద్రాద్రి జిల్లాలో 16 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. 140 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతాయి. ఈ జిల్లాలో అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంచుపల్లి, చంద్రుగొండ, దమ్మపేట, ములకలపల్లి, పాల్వంచ మండలాల్లో ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రంలో అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 44 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.

## ముగిసిన దక్షిణప్రాంత స్కూల్‌బ్యాండ్ పోటీలు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణ ప్రాంత బ్యాండ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఆండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యార్థి బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. బ్రాస్ బ్యాండ్ (బాలురు, బాలికలు), పైప్ బ్యాండ్ (బాలురు, బాలికలు) విభాగాల్లో దక్షిణ ప్రాంత స్థాయిలో విజేతగా నిలిచిన బృందాలు ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి బ్యాండ్ పోటీకి సౌత్‌జోన్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి. ముగింపు కార్యక్రమంలో సీఎం సలహాదారు కె.కేశవరావు, పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్, జాయింట్ డైరెక్టర్ రాజీవ్ తదితరులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ పోటీల్లో బ్రాస్ బ్యాండ్ (బాలురు) పోటీల్లో తెలంగాణ రెండో స్థానాన్ని, బాలికల విభాగంలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. పైప్ బ్యాండ్ (బాలికల విభాగం)లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

## ఎవరినీ వదలా !

ఇంటల్లుడి ఫోన్ ట్యాప్ చేయడానికి సిగ్గు లేదా?

నేను గాంధీ తాతను కాను.ఒకటి కొడితే రెండు కొడుతా

వ్యాపారులకు సహకరించడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే




హైదరాబాద్ అమృత్ తెలంగాణ: తన జోలికొచ్చినా తన భర్త జోలికొచ్చినా ఊరుకునేది లేదని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జాగృతి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటల్లుడి ఫోన్ ట్యాప్ చేయడానికి సిగ్గు లేదా? అని కేటీఆర్, హరీశ్‌రావులను ప్రశ్నించారు. తానేమీ గాంధీ తాతను కాదనీ, ఒకటి కొడితే రెండు కొడతానని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనం బాటకు వెళ్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటుంటే ఓర్వలేక నన్ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు. నన్ను పార్టీ నుంచి వెళ్లగొట్టిన వారి కండ్లు ఇంకా చల్లబడలేదని భావోద్వేగానికి గురయ్యారు.

తామెప్పుడూ బీఆర్ఎస్ మాదిరిగా జనాల నుంచి డబ్బులు వసూళ్లు చేయలేదని అన్నారు. తాను ఉద్యమంలో కొనసాగాననీ, తన భర్త వ్యాపారంతో ఇల్లు గడిచిందని చెప్పారు. ఇసుమంత కూడా అక్రమాలు చేయలేదని స్పష్టం చేశారు. జనంబాట పట్టిన తనకు కాంగ్రెస్‌తో దోస్తానీ ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని ఆమె ఖండించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేననీ, వ్యాపారులకు సహకరించడంలో గులాబీ బాటలోనే హస్తం పార్టీ నడుస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ వేసిన దొంగ దారులను కాంగ్రెస్ రహదారులుగా మారుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పన్నెండేండ్లలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ఆ రెండు పార్టీలు విఫలమయ్యాయని చెప్పారు. బీఆర్ఎస్‌లో తనకెప్పుడు సహకారం దొరకలేదనీ, నిజామాబాద్ ఎంపీగా తాను ఢిల్లీలో పోరాడుతుంటే, హైదరాబాద్ వారు దందాలు చేసుకున్నారని దుయ్యబట్టారు. తాను టాస్ మాత్రమే వేశాననీ, దానికే ఆందోళన పడితే ఎలా? అసలు టెస్ట్ మ్యాచ్ ముందుందని కవిత వార్నింగ్ ఇచ్చారు.

పారిశ్రామిక భూముల కోసం రాయితీతో ఇచ్చిన ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టేందుకు బీఆర్ఎస్ కిటీకీలు తెరిస్తే, కాంగ్రెస్ ఏకంగా తలుపులే తెరిచిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్‌లో కేటీఆర్ మంత్రిత్వశాఖ నుంచి హడావుడిగా ఐదెకరాల పారిశ్రామిక భూమిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే బంధువైన వ్యాపారికి కట్టబెడుతూ ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చాక మిగిలిన ఆరెకరాల భూమిని అదే వ్యాపారికి అప్పగించారని చెప్పారు. కృష్ణారావు కుమారుడు డైరెక్టర్‌గా ఉన్న నిర్మాణ కంపెనీలో 70 ఎకరాల్లో వెంచర్ చేపట్టి ప్రభుత్వ రోడ్డు, అసైన్డ్ భూములు, చెరువును కబ్జా చేశారని ఆరోపించారు. 2022లో పదెకరాలున్న చెరువు కాస్తా ఆరెకరాలకు తగ్గిందనీ, మిగిలిన నాలుగెకరాలు ఏమయ్యాయని ఆమె ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చెరువుల సుందరీకరణ పేరుతో ప్రయివేటుకు

అప్పగిస్తే కొన్ని మినహా మిగిలినవి పలువురు వ్యక్తులు కబ్జా చేసుకున్నారని చెప్పారు. కృష్ణారావు, బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు నిరాధార ఆరోపణలు చేయడం వెనుక ఉన్న గుంట నక్క తనకు తెలుసని హెచ్చరించారు.

అవినీతి, అక్రమాలపై కేసీఆరే చెప్పాలి

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాల గురించి కేసీఆర్‌కు తెలిసి జరిగిందా? లేక తెలియకుంటా జరిగిందా? అనే విషయాలు కేసీఆరే చెప్పాలని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు కవిత బదులిచ్చారు.

సీఎం అవుతా అప్పుడు చెబుతా

బీఆర్ఎస్, కాంగ్రెస్ దోపిడీని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కవిత హెచ్చరించారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక 2014 నుంచి జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తానని తెలిపారు.

లీగల్ నోటీసులు

తనపై భర్త అనిల్ కుమార్ పై నిరాధార ఆరోపణలు చేసినందుకుగాను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు టీ న్యూస్‌కు లీగల్ నోటీసులు ఇప్పించినట్టు తెలిపారు. వారం రోజుల్లో క్షమాపణ చెప్పకపోతే వారిని కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు.

## 2001లో పార్లమెంట్‌పై ఉగ్రదాడి..మృతులకు నివాళి




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: డిసెంబర్ 13, 2001వ సంవత్సరంలో పార్లమెంటుపై దాడి జరిగింది. ఈ దాడిలో ఒకరు సెక్యూరిటీ సిబ్బంది, ఒక పౌరుడితో సహా 14 మంది మృతి చెందారు. ఈ మృతులకు నేడు పార్లమెంటు భవనంలో ప్రధాని మోడీ, ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుతో పాటు పలవురు సీనియర్ పార్లమెంటు సభ్యులు కూడా నివాళులర్పించారు. కాగా, 2001లో డిసెంబర్ 13న లష్కరే తోయిబా (ఎల్ఇటి), జైషే మహ్మద్ (జెఎం) ఉగ్రవాద సంస్థలకు చెందిన ఐదుగురు భారీ ఆయుధాలతో పార్లమెంట్ క్లాంప్లెక్స్‌లో చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 14 మంది మృతి చెందారు.

# విపత్తులపై అప్రమత్తతే జీవరక్షణ

## అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి - కేంద్ర విపత్తు నిర్వహణ అధికారులు



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నజిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ప్రకృతి విపత్తులు, పరిశ్రమల్లో ప్రమాదాలు వంటి పరిస్థితులకు ఏ క్షణమైనా స్పందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కేంద్ర విపత్తు నిర్వహణ అధికారులు సూచించారు. విపత్తు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర అధికారులు మాట్లాడుతూ, వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణనష్టం తగ్గించేందుకు విపత్తు దళాలు అత్యంత వేగంగా చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ కేంద్రాల్లో నిరంతరం పాల్గొని ప్రతిసమస్యను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకం అని పేర్కొంటూ, వాతావరణ శాఖ హెచ్చరికలు వచ్చిన వెంటనే ప్రమాద ప్రాంతాల ప్రజలను ముందుగా అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు ఆదేశించారు. విపత్తుల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అవసరమైతే హెలికాప్టర్ సేవలను వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బాధితులకు అవసరమైన మందులు, ఆహారం, అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా సిద్ధం చేయాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, అగ్నిమాపక అధికారి ప్రభాకర్ తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మరోసారి పిఓ లకు తమ ఎన్నికల విధులపై కీలక సమాచారం అందించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రానికి సమయానికి చేరుకోవడంతో మొదలుకొని, ఎన్నికల సామాగ్రి స్వీకరణ, పోలింగ్ కేంద్రాలకు చేరుకొనుట, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక, తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. వారికి కీలక సూచనలు చేశారు. మొదటి విడత ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, అధికారులందరూ అదే స్ఫూర్తితో పనిచేసి రెండో విడత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. నిర్మల్ (గ్రామీణం), సారంగాపూర్, సోన్, దిలావర్పూర్, నర్సాపూర్ (జి), కుంటాల, లోకేశ్వరం ఆరు మండలాల్లో రెండో దశ ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆన్ లైన్ విధానంలో మండలాల నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న తహసిల్దార్లు, ఎంపీడీవోలు, జోనల్ ఆఫీసర్ల ను మండలాల వారిగా ఎన్నికల ఏర్పాట్ల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, జడ్పి సిఈఓ శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం పోలింగ్ నమోదు అయ్యేందుకు గ్రామాల్లో టామ్ టామ్ నిర్వహించి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి వందశాతం పోలింగ్ నమోదు అయ్యేందుకు గ్రామాల్లో టామ్ టామ్ నిర్వహించి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి రెండవ విడత గ్రామపంచాయితీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత అధికారులకు గూగుల్ మీట్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ స్లిప్ లతో పాటు 18 రకాల ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంటతీసుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని గ్రామాల్లో టామ్ టామ్ నిర్వహించాలని ఎంపీడీఓ, పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. వందశాతం పోలింగ్ నమోదుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిటర్నింగ్, ప్రెసిడింగ్ అధికారులు పోలింగ్ సామాగ్రి పరిశీలించుకుని పోలింగ్ కేంద్రానికి బయలుదేరాలని, క్యూ పద్ధతిలో ఓటింగ్ జరిగేలా చూసుకోవాలన్నారు. ఓటు వినియోగించుకునే అంశంపై సందేహం ఉంటె ఓటర్లకు తెలియజేయాలన్నారు. పోలింగ్ నమోదు వివరాలను టి-పోల్ పోర్టల్ నమోదు చేయడం జరుగుతుందని, పలు మార్లు పరిశీలించి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. కౌటింగ్ ప్రక్రియ పారదర్శకంగా ప్రశాంతవాతావరణంలో జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని వివరించారుఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డిపిఓ రమేష్, డిఎల్పీవో ఫణిందర్, మాస్టర్ ట్రైనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జోనల్, సెక్టర్, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిది మండలాల్లో నిషేధాజ్ఞలు అమల్లోకి

## మద్యం దుకాణాలు మూసివేత - 14న రెండవ విడత పోలింగ్



అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామపంచాయతీ రెండవ విడత ఎన్నికలు డిసెంబర్ 14వ తేదీ (ఆదివారం) ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదిలాబాద్ గ్రామీణం, మావల, బేలా, జైనథ్, సాత్నాల, భోరాజ్, తాంసీ, భీంపూర్ మండలాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఈ రోజు సాయంత్రం 5:00 గంటలలోపు ప్రచారం ముగించారు. ప్రచారం ముగిసిన తరువాత బహిరంగ సభలు, ర్యాలీలు, మైక్ అనౌన్స్మెంట్లు, మోటార్షోలతో పాటు ఎటువంటి కార్యక్రమాలకు నిర్వహించకూడదని, కఠినంగా నిషేధ ఆజ్ఞలు అమలు పర్చడం జరుగుతుంది ఎన్నికల ప్రశాంతత దృష్ట్యా, సంబంధిత ఎనిమిది మండలాల్లో %ూవఁ.163 దీచీూా% ప్రకారం నిషేధాజ్ఞలు నేటి సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమిగూడడం నిషేధం. శాంతిభద్రతల విషయంలో ఎటువంటి రాజీ ఉండదని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం ముగిసిన వెంటనే, ఎనిమిది మండలాల్లోని మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. డిసెంబర్ 14న పోలింగ్ అనంతరం, అదే రోజు మధ్యాహ్నం తర్వాత మండల కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగడంతో ఫలితాలు ప్రకటించబడతాయని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాత వాతావరణంలో జరుగేందుకు అన్ని శాఖలు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు గౌరవించి ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# భవిత కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో ఏఐ ల్యాబ్ ప్రారంభం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి ప్రత్యేక అవసరాలు గల పిల్లల నైపుణ్యాభివృద్ధికి కృత్రిమ మేధ (AI) ఆధారిత బోధన ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం డైట్ కళాశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల అభ్యాసన సామర్థ్యాలను అభివృద్ధి చేయడానికి రూపొందించిన ఆధునిక యంత్రాలు, మౌలిక వసతులతో కూడిన ఏఐ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏఐ ల్యాబ్ ప్రారంభంతో పిల్లల కమ్యూనికేషన్, అభ్యాస నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఆధునిక సాంకేతిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన ట్రెస్టిల్, కోబో టాబ్లెట్, RBD 2.0 సెల్, డిజిటల్ స్పీచ్ ట్రైనర్, గ్రూప్ హెయరింగ్ కిట్స్, AAC కిట్స్, డిజిటల్ స్పీచ్ థెరపీ పరికరాలు, సహాయక సాఫ్ట్‌వేర్ ద్వారా పిల్లల్లో అభ్యాస, కమ్యూనికేషన్ సామర్థ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ఉన్నత విద్య కోసం ఉట్నూర్‌లోని వికాసం పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని, రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి నిధుల సమీకరణతో పాటు బోధన సిబ్బంది నియామకానికి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. పెన్షన్, ఇతర సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటి పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి గర్భిణీ తప్పనిసరిగా టిఫా స్కానింగ్ చేయించుకోవాలని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, నీతి అయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, కోఆర్డినేటర్ తిరుపతి, రిసోర్స్ పర్సన్లు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# అందరు మెచ్చిన మంచి నాయకున్ని ఎన్నుకోవాలి: కలెక్టర్




భువనగిరి.అమృత్ తెలంగాణ: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామాల కోసం పాటుపడేవారిని, అందరూ మెచ్చిన మంచి నాయకులని ఎంచుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల్లో బాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడవ విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఓటు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.( నారాయణపూర్ మండల కేంద్రంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, అడ్డగూడూరు మండల కేంద్రంలో తాసిల్దార్ శేషగిరి రావు, ఎంపీడీవో, గుండాల మండల కేంద్రంలో అడిషనల్ డిఆర్డిఓ సురేష్, ఓటర్లకు ఓటు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా ఓటర్లతో తమ ఓటును డబ్బుకు ,మద్యానికి, ఇతరత్ర ప్రలోభాలకు లొంగకుండా నిజయమైన , ఒక మంచి సర్పంచ్ కానీ వార్డు మెంబర్ ను కానీ ఎంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కుప్రజాస్వామ్య పునాది అని,ఓటరు గా నమోదు అయిన ప్రతీ ఒక్కరు ఓటు వేయాలన్నారు.ఓటు హక్కు వినియోగం, అవగాహన ర్యాలీలు విద్యార్థులకి అవగాహన కల్పించడం వలన వాళ్ళు వాళ్ల ఇంట్లో పెద్ద వాళ్ళకి చెప్పడంతో మార్పు వస్తుందన్నారు.ఇప్పుడు విద్యార్థుల కావొచ్చు కానీ రాబోయే రోజుల్లో విద్యార్థులందరూ ఓటర్ లు అవుతారన్నారు.ఓటర్లు డబ్బులకు, మద్యానికి, గిఫ్ట్ లకి,బిర్యానీకి లేక వేరే ఇతర కానుకలలు ఇచ్చేవారికి ఓటు వేస్తే ఎన్నికల తర్వాత గెలిచిన అభ్యర్థిని గ్రామం అభివృద్ధి పై అడిగే హక్కుని కోల్పోతాం అన్నారు. మీ ఇంట్లో లేదా మీరు కలిసి పని చేసే చోట మంచి నాయకులను ఎంచుకోవడం వలన మన గ్రామం అభివృద్ధి చెందుతుందని చర్చించుకోవాలన్నారు.

# బీర్పూర్ మండలం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి.








బీర్పూర్ అమృత్ తెలంగాణ డిసెంబర్ 12: మండలంలోని కమ్మనూరు మంగేళ తాళ్ల ధర్మారం చిత్రవేణి గూడెం రేకులపల్లి నరసింహులపల్లె గ్రామాలలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ బీర్పూర్ మండలంలోని ప్రతి గ్రామంలో జీవన్ రెడ్డి చేసిన పని మాత్రమే ఉంది,జగిత్యాల నియోజకవర్గానికి ఉత్తర ద్వారం తెరిచే విదంగా కమ్మునూర్ కలమడుగు బ్రిడ్జి వంతెన నిర్మాణం చేశాను,వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా నేను రోడ్డు భవనాల శాఖ మంత్రిగా 40 కోట్ల రూపాయలతో బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేశాను ఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి మండలానికి ఒక జూనియర్ కళాశాల మంజూరు చేస్తే ఉమ్మడి సారంగపూర్ మండలంలో రెండు జూనియర్ కలశాలలు మంజూరు చేయడం జరిగింది,బీర్పూర్ మండలం కాకముందే బీర్పూర్ లో జూనియర్ కలశాల ఏర్పాటు చేశాను,బీర్పూర్ మండలం లోని ప్రతి గ్రామానికి త్రాగు నీటి సౌకర్యం కానీ సాగునీటి సౌకర్యం కల్పించబడేలా చొరవ తీసుకున్నాను రోళ్లవాగు ప్రాజెక్టును ఆధునికీకరణ అనే నెపంతో 1.టీఎంసీ నీటి సామర్థ్యానికి పెంచి 60 కోట్లు ఉన్న ప్రాజెక్టును 120 కోట్లకు పెంచి ఇప్పటి వరకు రోళ్లవాగు ప్రాజెక్టు పనులను పూర్తి చేయలేకపోయారు అన్నారు గత పాలకులు గత పది సంవత్సరాల నుండి చేసిన అభివృద్ధి ఏంటి అని అన్నారు ఈ మాసంలో రోళ్లవాగు స్లూయిస్ గేట్లు బిగిస్తాం అని హామీ ఇచ్చారు గత ప్రభుత్వంలో రోళ్లవాగు కట్ట తెగితే రైతుల వేలాది ఎకరాల పొలాలలో ఇసుక మెట్టలు వేస్తే రైతులకు ఒక్క రూపాయి సహాయం లేదు,మత్స్యకారుల కోట్లాది రూపాయల చేప రోళ్లవాగు తెగి కొట్టుకపోతే ఒక్క రూపాయి సహాయం అందించలేదు అని అన్నారు,గత ప్రభుత్వంలో చెల్లని రూపాయి ఈ ప్రభుత్వంలో ఎలా చెల్లుతుంది అని అన్నారు గత ప్రభుత్వంలో అభివృద్ధి చేయడం కాలేదు కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి నేను అభివృద్ధి చేస్తా అంటున్నారు,అభివృద్ధి చేసేది ఉంటే గత ప్రభుత్వంలో ఎందుకు చేయలేదు అన్నారు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేను అభివృద్ధి చేస్తా అంటున్నారు గత పది సంవత్సరాలలో గ్రామాలలో ఒక్క ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేయలేదు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే రేషన్ కార్డు మంజూరు చేయడం జరిగింది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ అమలు చేయడం జరిగింది,ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు అవుతున్న ప్రతి పథకాల ఫలితం నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే చెందుతుంది అన్నారు.

## వేంపేట్ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కు ఘన సన్మానం.



అమృత్ తెలంగాణ మెట్ పల్లి డిసెంబర్ 12: ఇటీవల జరిగిన మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన గోరు మంతుల ప్రవీణ్ కుమార్ ను మెట్ పల్లి పట్టణ ఇందిరానగర్ మాల సంఘం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పదవులు ఇంకా ఎన్నో పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గద్దల బాలరాజు,బత్తుల లక్ష్మణ్, గోరు మంతుల మారుతి, సోమిడి రాజయ్య,పొట్ట ప్రసాద్,సోమిడి ప్రదీప్, జంగం విజయ్ కుమార్, మద్దెల నితిన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జేసిబి ఆపరేటర్ భార్య సర్పంచ్ గా గెలుపు.



కోరుట్లరూరల్ అమృత్ తెలంగాణ నవంబర్ 12: మండలం గుమ్లాపూర్ గ్రామంలో, పెద్దగా చదువుకోకపోయినా గ్రామ పరిస్థితులపై అవగాహన ఉన్న జెసిబి ఆపరేటర్ రావట్ల శ్రీకాంత్, తన భార్య స్రవంతితో నామినేషన్ వేయించి, ఆమెను సర్పంచ్‌గా గెలిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సొంత సోదరుడు, పెద్దనాన్న కొడుకుపై విజయం సాధించడం విశేషం. గెలిచిన స్రవంతి మహిళా సాధికారతకు కృషి చేస్తూ, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని, ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఒక సామాన్య మహిళ, జెసిబి ఆపరేటర్ భార్య సర్పంచ్‌గా గెలవడం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడినట్లు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## గుండాల నూతన సర్పంచ్ ను సన్మానించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ ఇచ్చొడ మండలంలోని గుండాల గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన రషీద్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ని మర్యాద పూర్వకంగా కలిశి ఆశీర్వదాం తీసుకున్నారు. ఈ సందర్భంగా గుండాల సర్పంచ్ గా గెలుపొందినందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయనను సన్మానించి అభినందించారు.

## కోకస్మన్నూర్ గ్రామ సర్పంచును మరియు ఉప సర్పంచ్ ను సన్మానించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్...



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ నేరడిగొండ మండలంలోని క్యాంప్ కార్యాలయంలో ఇచ్చోడ మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామ సర్పంచ్ గా 147 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన షేక్ షమీన్ భాను ను గారిని మరియు ఉపసర్పంచ్ ను పార్టీ కార్యాలయంలో శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు వారి వెంట నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

## వుమెన్ ఫర్ ట్రీ2.0 కింద మొక్కలు నాటిన రాజరాజేశ్వరి మహిళా సంఘం సభ్యులు.







అమృత్ తెలంగాణ మెట్ పల్లి డిసెంబర్ 12: మెట్పల్లి పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ ల టీ మోహన్ ఆధ్వర్యంలో అమృత్ 2.0 కింద ఉమెన్ ఫర్ ట్రీ ఇంద్ర ప్రియదర్శని సమైక్యం శ్రీ రాజరాజేశ్వరి సంఘం మొక్కల సంరక్షణ కొరకు ఎంపిక కావడం జరిగింది. మెట్పల్లిలోని పెద్ద చెరువు కట్ట వద్ద మొక్కలునాటడం జరిగింది.కమిషనర్ మాట్లాడుతూ చెరువు కట్ట వద్ద మొక్కలు నాటడం జరిగిందని ఆ మొక్కలు సంరక్షణ బాధ్యత ఇంద్ర ప్రియదర్శని శ్రీ రాజరాజేశ్వర మహిళా సంఘం వారి బాధ్యత అని ప్రతిరోజు మొక్కలకు నీరు పోసి మొక్కలను కాపాడాలని మహిళలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ నాగేశ్వరరావు,సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, టిఎంసి సోమిడి శివ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, రాజరాజేశ్వరి సంఘం ప్రతినిధులు విజయ,భాగ్య,లత, రమాదేవి,సుధా,కళావతి, మౌనిక,నరసమ్మ,రిసోర్స్ పర్సన్ జ్యోతి, పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థుల తరుపున కంది శ్రీనివాస రెడ్డి ప్రచారం.





ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ భోరజ్ మండలంలో శుక్రవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పర్యటించారు. మండలంలోని గిమ్మ గ్రామాన్ని సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ముత్యాల నిఖిలేష్ ని భారీ మెజార్టీ తో గెలిపించాలని కంది శ్రీనివాస రెడ్డి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేసారు..అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అండదండలతో గ్రామాలని అభివృద్ధి చేసుకుందామన్నారు. అన్ని గ్రామపంచాయితీలలో కాంగ్రెస్ బలపరచిన సర్పంచ్ అభ్యర్ధులను గెలిపించుకోవాలని అందరు విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఎప్పుడు ఎలాంటి అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని అందరం కలిసి గ్రామాల సమస్యలను పరిష్కరించుకొని అభివృద్ధి దిశగా పయనింప చేద్దామన్నారు.

## రెండో విడత ఎన్నికల్లో గ్రామాలలో వైన్స్ లు తెరవద్దు



ఆలేర్ అమృత్ తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వైన్ షాపులు మూసివేయాలని బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు భువనగిరి ఎక్సైజ్ సూపర్డెంట్ వెంకట కృష్ణమూర్తి జారీ చేశారు. భువనగిరి బీబీనగర్ పోచంపల్లి వలిగొండ మరియు రామన్నపేట మండలాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి అన్నారు. డిసెంబర్ 14న జరిగే ఎన్నికలకు డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల నుండి 14వ తేదీ న జరిగే ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాక ఎక్సైజ్ అధికారుల అనుమతితో వైన్సులు తెరవాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల రోజు మద్యం విక్రయాల నిషేధం అమల్లో ఉంటుందన్నారు. ఆదేశాలు ఉల్లగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని భువనగిరి ప్రభుత్వ మద్యపాన నిషేధ అధికారి విష్ణుమూర్తి హెచ్చరించారు.

## అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే అభివృద్ధి

### ఎన్నికల ప్రచారంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



రాజురా,లో సర్పంచ్ అభ్యర్థి ముత్త గౌడ్ తరపున ముమ్మురం ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలు



రాజురా లో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతున్న దృశ్యం

నిర్మల్ జిల్లా లోకేశ్వరం డిసెంబర్ 12 అమృత్ తెలంగాణ లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి అయినటువంటి శ్యామల ముత్తా గౌడ్, ను మరియు వార్డు మెంబెర్ లను భారీ మెజారిటీ తో గెలిపించాలని సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి. ముధోల్ నియోజకవర్గం లో అన్ని పంచాయతీ లలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ లను మరియు వార్డు మెంబర్ లను భారీ మెజారిటీ తో గెలిపించలని కోరటం జరిగింది. మీ అందరి గెలుపు కాంగ్రెస్ పార్టీ కి మరియు మన కార్యకర్తలందరికి నాకు మనోదేర్యం కలిపిస్తుంది. పదవి లో లేకపోయినా అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నాము. ఇంకా రాబోయే రోజులలో రెట్టింపు ఉత్సహం తో మనం అందరం కాంగ్రెస్ కార్యకర్తల నియోజకవర్గం అభివృద్ధి కి తొడపాడుదాం.

పంచాయతీ ఎలక్షన్ తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ని మరియు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు, ను మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అడ్వైసర్ భోధన్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నీ మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ను కలిసి నియోజకవర్గం కు ఎక్కువ నిధులు తేవటానికి ప్రయత్నం చెద్దాం అని చెప్పారు.

## బాధిత కుటుంబాన్నీ పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావ్ పాటిల్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్



వడ్గం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

నిర్మల్ జిల్లా తానూర్ డిసెంబర్ 12 అమృత్ తెలంగాణ తానూర్ మండలం ఝరి (బి) గ్రామానికి చేందిన మాధవ్ రావు పాటిల్, ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్, గ ఝరి( బి )గ్రామస్తులతో కలిసి బాధిత కుటుంబాన్నీ కలిసి పరామర్శించడం జరిగింది బాధిత కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరడం జరిగింది

## ఎన్నికలను ప్రభావితం చేసేలా మద్యం పంచుతున్న వార్డ్ మెంబర్ పై కేసు నమోదు

**ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించిన వార్డు మెంబర్.**
**యాపిల్ గూడా గ్రామం నందు ఘటన, ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు.**
**30 క్వాటర్ లిక్కర్ బాటిల్స్ స్వాధీనం.**
**ఆదిలాబాద్ రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్**
**నిందితుడు : అనుములు ఆశన్న (49) S/O భూమన్న, ఆర్ఎంపీ డాక్టర్, యాపల్ గూడ.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆదిలాబాద్ రూరల్ మండలంలో నందు యాపలగూడ గ్రామం వార్డు మెంబర్ కై పోటీ చేస్తున్న అభ్యర్థి అనుములు ఆశన్న ఓటర్లను ప్రభావితం చేసేలా 30 క్వార్టర్ బాటిల్స్ మద్యాన్ని పంచుతుండగా ఆదిలాబాద్ రూరల్ పోలీసులు పట్టుకొని అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్ తెలియజేశారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఎలాంటి చర్యలు చేపట్టిన వారిపై చర్యలు తప్పవారి హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణం లోని ఎన్నికల జరగాలని, ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంగించిన పార్డి కె గ్రామ సర్పంచ్ అభ్యర్థి పై, మరికొందరిపై కేసు నమోదు

**విధులలో ఉన్న పోలీసులకు ఆటంకపరిచిన వ్యక్తులపై కేసు**
**నిబంధనలకు విరుద్ధంగా ప్రజలను ప్రలోభపెట్టేలా పార్టీ(దావత్) నిర్వాహన.**
**పార్టీ నిర్వహించిన సభ్యులపై కేసు నమోదు.**
**జైనథ్ పోలీస్ స్టేషన్లో కేసు. జైనథ్ ఎస్ ఐ గౌతం**




అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఎన్నికల నియమావళి ప్రారంభమైన సందర్భంగా నియమాలకు విరుద్ధంగా ప్రజల ప్రలోభ పెట్టేలా పార్టీ నిర్వహించి నియమాల ఉల్లంఘనకు చేపట్టిన జైనథ్ మండలం పార్డి కె గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఆస్థాక్ సుభాష్ పై కేసు నమోదు చేయడం జరిగిందని జైనథ్ ఎస్ఐ గౌతం తెలిపారు. ఎన్నికల ప్రచారం ముగిసిన సందర్భంలో ఎలాంటి ప్రచారాలు నిర్వహించకూడదని, రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదని, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ప్రచారం చేసిన రెచ్చగొట్టేలా వ్యవహరించిన చర్యలు తప్పవన్నారు. సర్పంచి అభ్యర్థి పై, పార్టీ సహకరించిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలలో ప్రలోభాలకు గురి చేసేలా ప్రవర్తించిన వారిపై పోలీసు చర్యలు తప్పవన్నారు. విధులలో ఉన్న పోలీసులకు ఆటంకపరిచినందుకుగాను అదే విధంగా ఎన్నికల ఉల్లంఘన చేపట్టినందుకుగాను ఇతనిపై జైనథ్ పోలీస్ స్టేషన్ నందు సెక్షన్లు 132,174,223 BNS తో కేసు నమోదు అయిందని తెలిపారు.

# అభివృద్ధి జరగాలంటే అధికారపార్టీతోనే సాధ్యం..

## పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల పక్షాన బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రచారం..



సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బజ్జీలు పోస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి





సర్పంచ్ ఎన్నికల ప్రచారం ఫుట్ బాల్ గుర్తు ఓటు వేయాలని బోరంచు శ్రీకాంత్ రెడ్డి దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గ్రామపంచాయితీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మావల పంచాయితీ పరిధిలో ప్రచారం చేపట్టారు. మావల లో అధికార పార్టీ బలపర్చిన మావల గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థి ధర్మపురి చంద్రశేఖర్ కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ఫుట్ బాల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తుచేశారు. రెండవ విడతలో జరగనున్న పంచాయితీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా , ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నల్ల వనిత , మోసిన్ , ఆరే గంగన్న, కలగట్టు గంగన్న, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, రహీం ఖాన్, రెండ్ల రాజన్న, రావుల ప్రవీణ్, దొగ్గలి ప్రవీణ్, కొత్తపల్లి అడెల్లు, దోసిలి సంతోష్ తదితరులు ఉన్నారు.

# ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది : ఎన్నికల ప్రచారం లో ఎమ్మెల్యే పాయల్ శంకర్



జందాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్



చాందా టి గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రచారం చేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఎమ్మెల్యే పదవి నాకు మీరు ఇచ్చిన పదవి, నేనేదో కొనుక్కుంటే వచ్చింది కాదు. ఈ పదవి తో ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇక్కడి ప్రజలకు, యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాలనే ఉద్దేశంతో ఎయిర్ పోర్టు మంజూరు చేయించడం జరిగిందన్నారు. లిగ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద (టి). జందాపూర్ . గూడ.రాంపూర్.తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రజలకు విన్నవించారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లు రావని కొందరు చెప్తున్నారని అలాంటి వారికి హెచ్చరించి చెబుతున్న, తాను దగ్గరుండి బిల్లులు తెప్పించే బాధ్యత తనపై ఉందన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, మురికి కాలువలు, మంచినీరు , విద్యుత్ ఇలాంటి మౌలిక సదుపాయాలు కల్పనకు తలవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు అండగా ఉండి మన అభ్యర్థులను గెలిపించండి: ఎమ్మెల్యే



వలిగొండ : అమృత్ తెలంగాణ: ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా అండగా ఉండి సర్పంచ్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో బాగంగా సంగెం, వర్కట్ పల్లి, వలిగొండ గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకు ప్రచారం నిర్వహించారు. వలిగొండలో సర్పంచ్ అభ్యర్థి కుంభం వెంకటపాపి రెడ్డి తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామాలలోని పేద ప్రజల అభివృద్ధిని విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణ మాఫీ,దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలకు సన్న బియ్యం పథకం, రేషన్ కార్డులు, 5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు నాణ్యమైన ఇందిరమ్మ చీరలు, సాగునీటి కాల్వల అభివృద్ధి ప్రవేశ పెట్టి అమలు చేస్తుందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ సభ్యులను గెలిపిస్తే అభివృద్ధి శూన్యం అని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామాలలోని పేద ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక స్థానాలు గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంభం విద్యాసాగర్ రెడ్డి, వెంకటపాపి రెడ్డి, శ్రీరామ్ రెడ్డి,బద్దం సంజీవ రెడ్డి, బందారపు లింగ స్వామి, గంగాధారి రాములు, బొల్ల శ్రీనివాస్, బత్తిని సహదేవ, కంకల కిష్టయ్యా, కొందూరు భాస్కర్, కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



అచ్చంపేట :అమృత్ తెలంగాణ: మండల పరిధిలోని నడింపల్లి గ్రామ సర్పంచ్ గా గ్రామస్తులు అందరూ టూత్ పేస్ట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తేజశ్రీ-విశ్వేశ్వర చారి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి తేజశ్రీ మాట్లాడారు. గ్రామస్తులందరూ ఆశీర్వదించి సర్పంచ్ గా ఒక్కసారి ఆకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని, మీరందరూ ఆశీర్వదించి టూత్ పేస్ట్ గుర్తు కు ఓటు వేసి సర్పంచ్ గా గెలిపిస్తే.. గ్రామంలో అత్యవసర సమయంలో గ్రామస్తులందరికీ ఉచిత అంబులెన్స్ సేవలు అమలు చేస్తానని, తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచిత విద్యను చదివిస్తానని గ్రామస్తులకు ప్రచారంలో హామీ ఇచ్చారు. గ్రామంలో మురుగు నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తారని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ నుంచే వచ్చే వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందే విధంగా నేనే స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. గ్రామంలో ఏ కుటుంబానికి ఆపద వచ్చిన ఏ సమయంలో అయినా అందరికీ అందుబాటులో ఉండి సమస్య పరిష్కారానికి సహకరిస్తానన్నారు. నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు వినియోగించుకునే విధంగా గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తానన్నారు.

# వావ్ చీర కట్టులో నీ అంత అందంగా మరెవ్వరు ఉండరేమో..!




హీరోయిన్స్ ను మోడ్రన్ డ్రస్ ల్లో స్కిన్ షో డ్రస్ ల్లోనే చూడాలని అభిమానులు ప్రేక్షకులు కోరుకుంటూ ఉంటారు. స్కిన్ షో చేసే వారికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.. అంతెందుకు స్కిన్ షో ఎక్కువగా చేసే హీరోయిన్స్ యొక్క ఇన్ స్టా గ్రామ్ పేజ్ కే ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉంటారు. అయితే కొద్ది మంది హీరోయిన్స్ చీర కట్టు లో కూడా చూపు తిప్పుకొనివ్వకుండా అందంగా ఉంటారు అంటూ ఇలాంటి ఫోటోలను చూసిన సందర్భంలో అనిపిస్తూ ఉంది. కీర్తి సురేష్ కెరీర్ ఆరంభం నుండే స్కిన్ షో కి దూరంగా ఉంటూ వచ్చింది. స్కిన్ షో చేయని హీరోయిన్స్ కు పెద్దగా ఆఫర్స్ దక్కిన సందర్భాలు ఇండస్ట్రీలో లేవు. ఈ మధ్య కాలంలో హీరోయిన్ అంటే మినిమం నడుము నాభి తొడలు చూపించాల్సిందే. కానీ కీర్తి సురేష్ మాత్రం వాటికి దూరంగా ఉంటూ ఇలా పద్దతైన చీర కట్టులోనే కనిపిస్తూ వచ్చింది. చీర కట్టు లో కనీసం నడుము అందం కూడా చూపించకుండా ఇంత అందంగా కనిపించగల హీరోయిన్ కీర్తి సురేష్ తప్ప మరెవ్వరు ఉండరేమో అంటూ అభిమానులు మాట్లాడుకుంటూ ఉన్నారు. ముద్దుగుమ్మ కీర్తి సురేష్ ఎరుపు చీరలో మెరిసి పోతుంది అంటూ అభిమానులు తెగ లైక్ చేస్తున్నారు. అందాలు ఆరబోయడం కంటే ఇలా చీర కట్టులో పద్దతైన అమ్మాయిగా నే కీర్తి సురేష్ ను చూడాలని తాము కోరుకుంటున్నాం అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మహానటి సినిమా తర్వాత పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ కీర్తి సురేష్ సర్కారు వారి పాట సినిమాలో కాస్త స్కిన్ షో చేసేందుకు ప్రయత్నించింది. ముందు ముందు మరింతగా స్కిన్ షో చేస్తుందా అనేది చూడాలి.

# జీరో సైజ్ నడుముతో మతి పోగొడుతోంది బాబోయ్



పదేళ్ల క్రితం వచ్చిన లవ్లీ సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శాన్వి శ్రీవాస్తవ. ఈ అమ్మడు మొదట్లో ఒకటి రెండు సక్సెస్ లు దక్కించుకున్నా ఆ తర్వాత మాత్రం అదృష్టం కలిసి రాకపోవడంతో ఫెయిల్యూర్ లను చవి చూడాల్సి వచ్చింది. ఫెయిల్యూర్స్ వల్ల ముద్దుగుమ్మ శాన్వి శ్రీవాస్తవ కొన్నాళ్ల పాటు కనిపించకుండా పోయింది. తిరిగి సినిమా ఇండస్ట్రీలో పాగా వేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. పదేళ్ల క్రితం లవ్లీ సినిమాలో ఎలా అయితే కనిపించిందో ఇప్పుడు కూడా అంతే ఫ్రెష్ ఫేస్ తో అందంగా కనిపిస్తుంది అంటూ ఈ ఫోటోలు చూస్తూ ఉంటే అనిపిస్తుంది. అందాల విందు విషయంలో ఈ అమ్మడు ముందు ఉంటుంది అనడంలో సందేహం లేదు. తాజాగా ఇన్ స్టా లో ఈమె షేర్ చేసిన ఈ ఫోటో అందరి హృదయాలను దోచుకుంటుంది అనడంలో సందేహం లేదు. కనిపించని కనిపించకుండా ఉన్న నడుము అందంను ఈమె చూపించింది. జీరో సైజ్ నడుముకు ప్రత్యక్ష సాక్ష్యం అన్నట్లుగా చాలా మంది ఈమె నడుముకు కామెంట్స్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు అయినా కూడా ఇంత అందంగా కనిపిస్తున్న శాన్వి శ్రీవాస్తవ కి యంగ్ హీరోలు ఇప్పటికైనా అవకాశం ఇవ్వాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. సినిమాలతో సక్సెస్ అవ్వలేక పోతున్న శాన్వి ఇలా ఇన్ స్టా ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇలా అయిన మళ్లీ సినిమాల్లో ఈమెకు ఆఫర్స్ రావాలని ఆశిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా ఈమె సిరీస్ ల్లో కూడా నటిస్తే బాగుంటుందనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# ఆదిపురుష్ బ్యూటీ చీర కట్టులో 'షో' అదుర్స్



తెలుగు లో చాలా సంవత్సరాల క్రితమే ఒక సినిమా లో నటించిన ముద్దుగుమ్మ కృతి సనన్ మళ్లీ ఇన్నాళ్లకు తెలుగు హీరో ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ సినిమా లో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ అమ్మడు ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా దూసుకు పోతుంది. స్టార్ హీరోలకు ఈమె మోస్ట్ వాంటెడ్. భాష ఏదైనా అందరూ హీరోయిన్స్ సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్ స్టా లో అందాల ఆరబోత చేయడం కామన్ గా మారింది. బాలీవుడ్ లో ఎంతో మంది స్టార్ హీరోయిన్స్ తో పోల్చితే కృతి సనన్ అందాల ఆరబోత విషయంలో ఒక అడుగు ముందే ఉంటుంది అనడంలో సందేహం లేదు. కృతి సనన్ స్కిన్ షో చేసినా లేదంటే ఇలా చీర కట్టు లో కనిపించినా కూడా అభిమానులు ఆమెను ఆరాధిస్తూనే ఉంటారు.. అభిమానిస్తూనే ఉంటారు అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు ఎంతటి బిజీగా ఉన్నా కూడా ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ను రెగ్యులర్ గా షేర్ చేసి అభిమానులను సంతృప్తి పర్చుతోంది.




# అందాల వేదిక.. నాభి అందాలతో స్టన్నింగ్ లుక్



బాణం అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన క్యూట్ హీరోయిన్ వేదిక ఆ తర్వాత తెలుగు తమిళం కన్నడ అని భాషా బేధాలు లేకుండా ప్రతి ఇండస్ట్రీలో కూడా సినిమాలు చేసుకుంటూ వస్తోంది. ఇక ఈ బ్యూటీ మొదట్లో చాలా హెూమ్లీ గా కనిపించినప్పటికీ ఇప్పుడు మాత్రం గ్లామర్ ప్రజెంటేషన్ తో ఆశ్చర్యపరస్తోంది. ఎప్పటికప్పుడు వేదిక సరికొత్త గ్లామరస్ ఫోటోషూట్స్ తో ఆకట్టుకుంటూనే ఉంది. ఇటీవల కాలంలో ఇన్స్టాగ్రామ్ లో అత్యధిక ఫాలోవర్స్ ను సంపాదించుకున్న వారిలో వేదిక కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. ఈ బ్యూటీ మొదట్లో పెద్దగా గ్లామరస్ పాత్రల్లో అయితే కనిపించలేదు. ఇప్పుడు మాత్రం ఎలాంటి పాత్ర వచ్చిన సరే చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని ఈ ఫోటోషూట్స్ ద్వారా చెప్పుకునే చెబుతోంది. గతంలో వేదిక బికినీ అందాలతో కూడా స్టన్ అయ్యేలా చేసింది. ఇక తెలుగులో ఆమె బాణం తర్వాత మళ్ళీ అలాంటి మంచి సినిమాలో కనిపించింది లేదు. మధ్యలో బాలయ్య బాబుతో అలాగే మరికొన్ని చిన్న సినిమాల్లో నటించింది కానీ అవి ఏమీ వర్కౌట్ కాలేదు. ఇక తమిళంలోనే ఎక్కువగా అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు అందుకోవడానికి ప్రయత్నాలు అయితే చేస్తోంది. రీసెంట్ గా అమ్మడు నడుము అందాలను హైలెట్ చేసిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. ఇంతకుముందు వేదిక బికినీలో కనిపించినప్పటికీ ఈ నాభి అందాలు మాత్రం అంతకుమించి అనేలా ఉన్నాయి అని ఆమె ఫాలోవర్స్ చాలా పాజిటివ్ గా స్పందిస్తున్నారు. ఏదేమైనా వేదిక మాత్రం గ్లామర్ పాత్రల్లో నటించడానికి ఆసక్తి చూపిస్తోంది. కానీ ఆమె అనుకున్నంత రేంజ్ లో మాత్రం అవకాశాలు రావడం లేదు. ఇక వేదిక ప్రస్తుతం తమిళ సినిమాలు మాత్రమే కాకుండా కన్నడ ఇండస్ట్రీలో కూడా మంచి అవకాశాలు అందుకునే ప్రయత్నం చేస్తుంది. ఇక తెలుగులో కూడా ఈ బ్యూటీకే రవితేజ సినిమాలో అవకాశం వచ్చే ఛాన్స్ ఉన్నట్లుగా కూడా కథనాలు వెలువడుతున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com